క్లుప్తంగా

ట్రిపుల్ ఐటీకి ఎంపిక


విద్యార్థిని శ్రావణిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బాడంగి: స్థానిక ఉన్నత పాఠశాలలోని భవిత కేంద్రంలో పదో తరగతి చదివిన దివ్యాంగ విద్యార్థిని శ్రావణి నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యిందని ప్రత్యేక టీచర్ కొల్లి ఈశ్వరరావు తెలిపారు. విద్యార్థిని శ్రావణిని హెచ్ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయ సిబ్బంది బుధవారం అభినందించారు.

కామేశ్వరరావుకు నివాళి


కామేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వేణుగోపాలనాయుడు, తదితరులు

బాడంగి: మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కామేశ్వరరావు ఇటీవల మృతి చెందారు.ఆయన దశదిన కర్మను కుటుంబ సభ్యులు బుధవారం నిర్వహించారు. ఈకార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు యామల శివప్రసాద్, పార్టీ ప్రధాన కార్యదర్శి తెర్లి శ్రీనివాసరావు, సీనియర్ నాయకుడు తెంటు మధుసూదనరావు హాజరయ్యారు. కామేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తమ సంతాపం తెలిపారు.

మర్యాద పూర్వక కలయిక


మాజీ ఎమ్మెల్యే శంబంగితో ఆర్.నారాయణమూర్తి

బొబ్బిలి: ప్రముఖ నటుడు, నిర్మాత, దర్శకుడు ఆర్.నారాయణమూర్తి స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలోమాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడును బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు.రైతులు, ప్రజలకు అందాల్సిన సంక్షేమ పథకాలపై ప్రభుత్వాలను ప్రశ్నించాలని, పాలక పక్షం చేపడుతున్న దురాగతాలను ప్రజల్లో ఎండగట్టాలని శంబంగికి ఆయన సూచించారు. పోరాటాలతోనే సామాన్యులకు న్యాయం జరుగుతుందని, ప్రజా సమస్యలపై, అన్యాయానికి గురవుతున్నవారి పక్షాన పోరాటానికి తానెప్పుడూ సిద్ధంగా ఉంటానని చెప్పారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు


తెర్లాం అంగన్‌వాడీ కేంద్రం-4లో రికార్డులు పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీఓ వరహాలమ్మ

తెర్లాం: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్లు 4,5లో ఐసీడీఎస్ బాడంగి పీఓ వరహాలమ్మ బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఆయా సెంటర్లలో ప్రీస్కూల్ పిల్లలు, కార్యకర్తలు, హెల్పర్ల హాజరు, ఇతర రికార్డులను, పౌష్టికాహార స్టాక్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు పార్వతి, శ్రీదేవికి ఆమె పలు సూచనలు చేశారు.రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, సమయపాలన పాటించాలని, పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యా బోధన చేయాలని చెప్పారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

రేగిడి: ఉంగరాడ మెట్ట సబ్‌స్టేషన్ పరిధిలోని తునివాడ, వెంకంపేట, కోడిశ, కందిశ, జోడుబందల, చిన్నకోడిశ తదితర గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరా యం కలగనుందని విద్యుత్‌శాఖ ఈఈ జి.సురేష్‌బాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లను ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అంతిమయాత్రలో అవస్థలు


బురదరోడ్డులో శ్మశానానికి శవాన్ని తీసుకెళ్తున్న చినభీమవరం గ్రామస్తులు

బాడంగి మండలం చినభీమవరం గ్రామానికి చెంది శ్మశానవాటికకు సరైన దారిలేదు. వర్షాకాలం వస్తే బురద దారిలో మృతదేహాలను తరలించేందుకు గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. సుమారు మూడుకిలోమీటర్ల దూరంలో ఉన్న వేగావతి నదీ తీరంలోని శ్మశానవాటికకు వెళ్లేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. గ్రామానికి చెందిన కొల్లిసన్యాసమ్మ మృతదేహాన్ని బుధవారం శ్మశానవాటికకు తరలించేందుకు శ్రమించాల్సి వచ్చిందంటూ గ్రామస్తులు తెలిపారు. బురదలో మృతదేహాన్ని ఎక్కడపడేస్తామన్న బెంగ వెంటాడిందని, అధికారులు, పాలకులు స్పందించి తక్షణమే రోడ్డుతో ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

– బాడంగి

వంచనకు మారుపేరు చంద్రబాబు

- వైఎస్సార్‌సీపీ మండల విస్తృతస్థాయి సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శంబంగి


మాట్లాడుతున్న మాజీ ఎమెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: ప్రతి ఎన్నికల్లో వందల హామీలు గుప్పించడం..అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేయడం చంద్రబాబు కు అలవాటుగా మారిందని, ఆయన వంచనకు మారుపేరుగా నిలిచారని మాజీ ఎమ్మెల్యే, బొబ్బిలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ఆరోపించారు. మండల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు,ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు ఆధ్వర్యంలో పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. అతిథిగా హాజరైన శంబంగి మాట్లాడు తూ 2024 ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్‌తో పాటు 143 హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు.హామీలను అమలుచేయకపోవడం, కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలపై వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు 'బాబు ష్యూరిటీ -మోసం గ్యారంటీ' పేరిట ఇంటింటి ప్రచారం చేయాలని పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. రైతులకు ఏడాదికి రూ.20 వేల పెట్టుబడి సాయం, ఆడబిడ్డకు నెలకు రూ.1500, నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 50 ఏళ్ల దాటిన వారికి పెన్షన్‌తో పాటు చాలా హామీలు ఇంకా అమలకు నోచుకోలేదన్నారు. కానీ హామీలన్నీ అమలు చేసే శామని సీఎం చంద్రబాబు చెబుతుండడం విడ్డూరంగా ఉందని, ఇది ప్రజలను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు చేసిన మోసాన్ని గ్రహించిన ప్రజలు ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని, అందుకే చంద్రబాబు సభలు జనం లేక వెలవెలబోతున్నాయన్నారు.మరో వైపు ప్రజా సమస్యలపై వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఎక్కడికి వెళ్లినా జనం భారీగా తరలివస్తున్నారని, ఇది చూసి చంద్రబాబుకు భయం పట్టుకుందన్నారు.

కార్యకర్తకే అందలం..

వచ్చేది జగనన్న ప్రభుత్వమేనని,జగనన్న 2.0లో ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందని శంబంగి అన్నారు.జగనన్నకు ఒక కన్ను ప్రజలైతే మరో కన్ను కార్యకర్తలేనని స్పష్టంచేశారు. కార్యకర్తలు 'బాబ ష్యూరిటీ..మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వైస్ ఎంపీపీలు బెల్లాన ప్రసాద్,పెంకి శేఖర్, మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, బ్రాహ్మణకార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రాయులు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కిర్ల చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు దర్రు పైడిరాజు, మండల యూత్ విభాగం అధ్యక్షుడు పత్తిగుళ్ల ఏక్‌నాథ్, పలుగ్రామాల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు


సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలు

కేసుల రాజీకి మధ్యవర్తిత్వం దోహదం


ర్యాలీ చేస్తున్న న్యాయవాదులు, తదితరులు

రాజాం సిటీ: కేసుల రాజీకి మధ్యవర్తిత్వం ఎంతో దోహదపడుతుందని స్థానిక కోర్టు సీనియర్ సివిల్ జడ్జి కె.శారదాంబ అన్నారు. స్థానిక కోర్టు సముదాయం నుంచి అంబేడ్క ర్ జంక్షన్ వరకు బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా కక్షిదారులు కేసులు రాజీపడ డం వల్ల సమయం, డబ్బులు ఆదా చేసుకోవడంతోపాటు మున్ముందు ఎలాటి ఇబ్బందులు ఉండవన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి కె.నైమిష, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎస్.మురళీధరరావు, కార్యదర్శి తిరుపతినాయుడు, ప్రభుత్వ న్యాయవాది పి.శ్రీనివాస్, న్యాయవాదులు కె.రామినాయుడు, ఎస్.పోలారావు, రెడ్డి విజయ్‌కుమార్, వై.ఎస్.శ్రీనివాస్, ఐ.శ్రీరాములునాయుడు, సీహెచ్.శంకరరావు, ఎం.శ్రీనివాసరావు, రెడ్‌క్రాస్ సభ్యులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్, పారాలీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం


రేగిడి : మండల కేంద్రంలో ర్యాలీ చేస్తున్న డాక్టర్ అసిరినాయుడు, వైద్యసిబ్బంది

రేగిడి: పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా చాలా వరకు వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి చందక అసిరినాయుడు అన్నారు.మండలంలో రేగిడి, ఆమదాలవలస గ్రామాల్లో డయేరియా నిర్మూలనపై బుధవారం అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేడి, వేడి ఆహార పదార్థాలు తినాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, రోడ్డు పక్క విక్రయించే ఫాస్ట్ ఫుడ్ తినొద్దని సూచించారు. సీహెచ్‌ఓ సుందరేశ్వరరావు, హెల్త్ సూపర్ వైజర్ కె.వి.అప్పారావు, హెచ్‌వీలు పుష్ప, జ్యోతి, ఎల్‌టీ రమణ, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మురుగు లేకుండా చూసుకోవాలి

మెంటాడ: నివాస పరిసరాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని మలేరియా స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసరావు గిరిజనులకు సూచించారు. మండలంలోని పలు గిరిజన గ్రామాల్లో ప్రజలకు మలేరియా, డెంగ్యూ వ్యాధుల బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం అవగాహన కల్పించారు.దోమతెరలు వాడాలని చెప్పారు. దోమల నివారణతోనే మలేరియా అరికట్టడం సాధ్యమని, ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. దోమల నివారణ మందు పిచికారీ మొదటి విడత పూర్తయ్యిందని, రెండో విడతకు సహకరించాలని కోరారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్లు ఈశ్వరరావు, సత్య ప్రసాద్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం


వంగర: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సహోపాధ్యాయులు, విద్యార్థులు


రేగిడి: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న, ఎంఈఓ ప్రసాదరావు, తదితరులు

రేగిడి: మండలంలోని మునకలవలస గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల నుంచి బదిలీ అయిన ఏడుగురు ఉపాధ్యాయులను ఆ గ్రామ పెద్దలు, సహోపాధ్యాయులు బుధవారం సన్మానించారు.ఉపాధ్యాయులకు అతిథిగా హాజరైన ఎంఈఓ ఎం.వి.ప్రసాదరావు, పెద్దలు జ్ఞాపికలు అందజేశారు.సర్పంచ్ వావిలపల్లి చంద్రశేఖర్, హెచ్ఎం సత్యనారాయణ, క్లస్టర్ హెచ్ఎం బి.సునీత, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ లావేటి లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ పాట్నూరు జ్యోతి, మాజీ సర్పంచ్ శాసపు జనార్దనరావు, ఉపాధ్యాయులు వీరన్నాయుడు, శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

యూ.కె.గుమ్మడ హైస్కూల్‌లో..

వంగర: మండలంలోని యూ.కె.గుమ్మడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేసి వేర్వేరు పాఠశాలలకు బదిలీ అయిన ఆరుగురు ఉపాధ్యాయులను విద్యార్థులు, సహోపాధ్యాయులు బుధవారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. హెచ్ఎం ఎస్.వి.ఎస్.ఎస్ సోమేశ్వరరావు మాట్లాడుతూ అంకిత భావంతో విధులు నిర్వర్తించే ఏ ఉద్యోగికైనా సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని తెలిపారు.

పోలీసులు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి


హెల్త్ చెకప్‌లను పరిశీలిస్తున్న డీఎస్పీ రాఘవులు, తదితరులు

రాజాం సిటీ: పోలీస్ సిబ్బంది అంతా తమ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు సూచిం చారు. స్థానిక కేర్ ఆస్పత్రిలో రాజాం టౌన్, రూరల్ సర్కిల్ పరిధిలోని రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండ లాల్లో పనిచేస్తున్న పోలీసులకు బుధవారం వైద్యపరీక్షలు చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ఒత్తిడికి గురై అనారోగ్యం బారినపడిన వారిని గుర్తించి ఆరోగ్యం మెరుగుపర్చేందుకు మెడికల్ చెకప్‌లు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఇందుకు సంబంధించి పోలీసు వెల్ఫేర్ అసోసియేషన్ నుంచి రూ. వెయ్యి చొప్పున అందించనున్నట్టు చెప్పారు. ఎనిమిది మంది ఎస్‌ఐలు, 16 మంది ఏఎస్‌ఐలు, 33 మంది హెచ్‌సీ లు, 110 మంది పీసీలు, 23 మంది మహిళా కానిస్టేబుళ్లు, 44 మంది మెన్, ఉమెన్ హోంగార్డులు, 15 మంది డ్రైవర్ల కు జీఎంఆర్ కేర్ సహకారంతో ఈ చెకప్‌లు చేయించామని తెలిపారు. టౌన్, రూరల్ సీఐలు కె.అశోక్‌కుమార్, హెచ్.ఉపేంద్ర, తదితరులున్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- డ్వామా పీడీ శారదాదేవి


రాజాం సిటీ: ఉపాధి సిబ్బందితో సమీక్షిస్తున్న డ్వామా పీడీ శారదాదేవి

వంగర: విధుల్లో నిర్లక్ష్యం వహించే ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తప్పవని డ్వామా పీడీ ఎస్.శారదాదేవి హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో బుధవారం సమీక్షా సమావేశం నిర్వ హించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఉపాధిహామీ పనులను లక్ష్యాల మేరకు చేపట్టకపోవడంతో వంగర మండలం జిల్లాలో అట్టడుగున ఉందని తెలిపారు. మండలంలోని చాలా గ్రామాల్లో ఫీల్డ్‌అసిస్టెంట్లు పనులు చేయించ డంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రకృతి వనరులను రక్షించుకోవాలని, గ్రామాల్లో చిన్న,సన్నకారు రైతులకు ఉపయోగపడే విధంగా పనులు చేయాలని చెప్పారు. గ్రామాల్లో అర్హులందరికీ పనులు కల్పించాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యానవన పంటల సాగుకు అందిస్తున్న ప్రోత్సాహాలను, వాటి సాగుతో కలిగే లాభాలను రైతులకు వివరించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు.

ప్రత్యేక దృష్టిసారించాలి

మండలంలో ఉపాధి హామీ పథకం నిర్వహణపై ఉపాధి సిబ్బంది ప్రత్యేక దృష్టిసారించాలని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ కోరారు. సమావేశంలో డ్వామా పీడీ దృష్టికి పలు సమస్యలను తీసుకువచ్చారు. గతంలో ఉపాధిహామీ పథకంలో వంగర మండలం జిల్లాలో మొదటి స్థానంలో ఉండేదని, ప్రస్తుతం చివరి స్థానంలో ఉండ డం దురదృష్టకరమన్నారు. గ్రామాల్లో వేతనదారులకు పార్టీలకతీతంగా పనులు కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. మడ్డువలస ప్రాజెక్టు ముంపు గ్రామాలు పటువర్ధనం, గీతనాపల్లిలో పనులు చేయించేందుకు వనరులు లేవని, అధికారులు సమీక్షించి వనరులు గుర్తించే విధంగా ఆదేశాలివ్వాలని పీడీని కోరారు. అలాగే మండలంలో ఇంజినీరింగ్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్ల కొరత ఉందని, తక్షణమే భర్తీ చేయాలని కోరారు. ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి, ఏపీఓ మర్రాపు సత్యవతి పాల్గొన్నారు.

లక్ష్యాలను పూర్తి చేయాలి

రాజాం సిటీ: ఉపాధి హామీ పథకంలో భాగంగా ఇచ్చిన లక్ష్యాలను పూర్తిచేయాలని డ్వామా పీడీ శారదాదేవి సిబ్బందికి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలో ఫారం పాండ్లు, కంపోస్టు ఫిట్‌ల పనులు, ఉద్యానవన పంటల సాగు, తదితర పనుల ప్రగతిపై ఆరా తీశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫారంపాండ్ల వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించి, వారితో వాటిని తవ్వించాలని సూచించారు. మండలంలో 3,780 కంపోస్టు ఫిట్‌లు తవ్వాలని లక్ష్యం విధించగా ఇప్పటి వరకు 350 మాత్రమే పూర్తిచేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్ష్యాలను చేరుకోకపోవడానికి కారణమేమిటని సిబ్బందిని ప్రశ్నించారు. ప్రతి ఒక్కరూ తమ లక్ష్యాలను త్వరితగతిన పూర్తిచేయాలని చెప్పారు.ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు, ఈసీ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు



బొబ్బిలిరూరల్: పెంట గ్రామంలో మహిళలకు వరినాట్లపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ శ్యామ్‌సుందర్

బొబ్బిలిరూరల్: పంటలకు రసాయన ఎరువులు, పురుగు మందులను మోతాదుకు మించి వినియోగించవద్దని, వ్యవసాయ శాఖ సిబ్బంది సూచనల మేరక ఎరువులు, పురుగు మందులు వాడాలని వ్యవసాయ శాఖ ఏడీఏ మజ్జిశ్యామ్‌సుందర్ రైతులకు సూచించారు.పెంట గ్రామం లో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో వరినాట్ల పనులను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశా రు. నారు చివర్లు తుంచి క్రమ పద్ధతిలో నాటు కోవాలని ఉభాలు చేస్తున్న మహిళలకు వివరించారు. దమ్ము సమయం లో ఎకరా పొలానికి ఒక బస్తా డీఏపీ,30 కేజీల యూరియా వేయాలని, తర్వాత భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులు వాడాలని చెప్పారు. వీఏఓ శ్రావణి పాల్గొన్నారు.

వరుస క్రమంలో నాట్లు వేయాలి

రేగిడి: వరి నాట్లను వరుస క్రమంలో వేసుకోవాలని ప్రకృతి వ్యవసాయ పీఆర్పీ రమాదేవి రైతులకు సూచించారు. మండలంలో ఉంగరాడ, గుల్లపాడు, వండానపేట తదితర గ్రామాల్లో బుధవారం వరి నాట్ల పనులను పరిశీలించారు. వరుసక్రమంలో నాట్లు వేసే విధానంపై మహిళా కూలీలకు అవగాహన కల్పించారు. ఈ విధానం ద్వారా కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు.

తప్పులు లేని ఓటర్ల జాబితా సిద్ధం చేయాలి


బీఎల్‌ఓలకు సూచనలు చేస్తున్న ఆర్డీఓ రామ్మోహనరావు

బొబ్బిలిరూరల్: తప్పులు లేని ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని ఆర్డీఓ జె.వి.వి.రామ్మోహనరావు బీఎల్‌ఓ లకు సూచించారు.స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల బీఎల్‌ఓలకు అయిదో రోజు బుధవారం ఇచ్చిన శిక్షణను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కొత్తగా ఓటు హక్కు కోసం ఎవరైనా దరఖాస్తు చేసుకుంటే వారి పూర్తి వివరాలను సేకరించి, విచారించాలని చెప్పారు.18 ఏళ్ల నిండిన వారిని ఓటరుగా నమోదు చేసేందుకు ఫారం 6 సేకరించాలని, జాబితా నుంచి పేర్ల తొలగింపునకు ఫారం-7, సవరణకు ఫారం -8ను వినియోగించాలని సూచించారు.ఎన్నికల సంఘం నిబంధనల మేరకు విధులు నిర్వర్తించాలని, ఓటర్లతో గౌరవప్రదంగా నడుచుకోవాలని చెప్పారు. ఆయన వెంట తహసీల్దార్ జి.హేమంత్, ఎలక్షన్ డీటీ బలివాడ గౌరీశంకర్ ఉన్నారు.

ఈదురు గాలుల బీభత్సం


తెర్లాం: గొలుగువలసలో దుకాణంపై కూలిన చెట్టు


వంగర: చౌదరివలస నేలకొరిగిన అరటి చెట్లు

తెర్లాం: మండలంలో మంగళవారం రాత్రి ఈదురు గాలులతో వర్షం కురిసింది. గొలుగువలస గ్రామంలో కార్పెంటర్ దుకాణంపై భారీ వృక్షం కూల డంతో దుకాణం ధంసమైంది.దుకాణంలో సామగ్రి, యంత్రాలు, వివిధ రకాల కలపతో తయారు చేసిన ఫర్నీచర్ ధ్వంసం కావడంతొ సుమారు రూ.1.50లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్టు దుకాణం యజమాని వాసుదేవు పోలిరాజు వాపోయారు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఎనిమిది ఎకరాల్లో అరటిపంటకు నష్టం

వంగర: మండలంలో మంగళవారం రాత్రి ఈదురు గాలులు వీయడంతో చౌదరివలస గ్రామంలో ఎనిమిది ఎకరాల అరటి పంట నేలమట్టమైంది. రైతులు చౌదరి రాధాకృష్ణ, చౌదరి రామినాయుడు, వేగిరెడ్డి సత్యనారాయణ, చౌదరి లక్ష్మణరావు, చౌదరి హరికృష్ణ, పాట్నూరు శ్రీనివాసరావు, గాడి కోటేశ్వరరావు తదితరులకు చెందిన అరటి పంటకు నష్టం వాటిల్లింది. పంట చేతికందే సమయంలో నేలమట్టం కావడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం తమకు పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తం

రాజాం: వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు ఆదేశించారు.స్థానిక మండల పరిషత్ కార్యాల యంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ గ్రామాల్లో తరచూ పారిశుద్ధ్య పనులు చేయించాలని సూచించారు. అంతకు ముందు బొద్దాం గ్రామంలో పర్యటించి 11 తాగునీటి బోర్ల నుంచి నీటి శాంపిల్స్ సేకరించారు. అలాగే చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు.

గ్రీన్ అంబాసిడర్లకు సన్మానం

తెర్లాం: మండల కేంద్రంలో పని చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లను స్థానిక గ్రామ సచివాలయంలో ఎంపీడీఓ రేగి రాంబాబు ఆధ్వర్యంలో బుధవారం సన్మానించి, పారిశుద్ధ్య పనుల నిర్వహణకు అవసరమైన సామగ్రిని అందజేశారు.ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజారోగ్యంలో గ్రీన్ అంబాసిడర్ల పాత్ర ప్రశంసనీయమన్నారు. ఈఓపీఆర్డీ నీలిమ, మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీ ప్రతినిధి నర్సుపల్లి వెంకటేశ్వరరావు, సర్పంచ్ బోనెల రూప, ఎంపీటీసీ సభ్యుడు జి.ఆనందరావు పాల్గొన్నారు.

లైన్‌మన్ లేక ఇబ్బందులు

రాజాం: మండలంలోని బొద్దాం గ్రామానికి లైన్‌మన్ లేక పోవడంతో ప్రజలు, రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వైస్ ఎంపీపీ నక్క వర్షిణి అన్నారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గత ఆరు నెలలుగా బొద్దాం గ్రామానికి లైన్‌మన్ లేరని, విద్యుత్ సరఫరాలో ఆటంకాలు ఏర్పడినప్పుడు ఎవరూ మరమ్మతులు చేపట్టడంలేదని తెలిపారు. గ్రామంలో 129 వ్యవసాయ పంపుసెట్లు ఉన్నాయని, వీటిలో చాలా పంపుసెట్లకు సంబంధించిన లైన్లలో సమస్యలు ఉండడం వల్ల విద్యుత్ సరఫరా కావడంలేదని వివరించారు. సక్రమంగా విద్యుత్ సరఫరా కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమ గ్రామానికి లైన్‌మన్‌ను నియమించాలని కోరారు.

పాఠశాలల సందర్శన

రేగిడి: మండలంలోని వండాన పేట, చాటాయవలస, ఉప్పరనాయుడువలస తదితర గ్రామాల పాఠశాలలను ఎంఈఓ ఎం.వి.ప్రసాదరావు బుధవారం సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్న భోజన వంటకాలను పరిశీలించారు. వంట నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. రోజూ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని, కాచి, చల్లార్చిన నీటిని ఇవ్వాలని, వంటకాలపై మూ తలు పెట్టాలని చెప్పారు. అలాగే విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరీక్షించారు.

చెత్తసేకరణ పరిశీలన

వంగర/బొబ్బిలిరూరల్: వంగర మండలంలోని శ్రీహరిపురం, బాగెంపేట గ్రామాల్లో, బొబ్బిలి మండలంలోని కలవరాయి గ్రామంలో గ్రీన్ అంబాసిడర్లు ఇళ్ల నుంచి చేపడుతున్న చెత్తసేకరణ పనులను ఎంపీడీఓలు ఎస్.రఘునాథాచారి, పి.రవికుమార్ బుధవారం ఉదయం పరిశీలించారు. ఈసందర్భంగా మహిళలకు వారు పలు సూచనలు చేశారు. చెత్తను ఆరుబయట పారబోయవద్దని, ఇళ్ల వద్దకు వచ్చే గ్రీన్ అంబాసిడర్లకు తడి,పొడి చెత్తను వేరువేరుగా అందించాలని చెప్పారు. అలాగే గ్రీన్ అంబాసిడర్లకు సన్మానం చేశారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, బొబ్బిలి డిప్యూటి ఎంపీడీఓ అల్లుభాస్కరరావు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు


వండానపేటలో వైద్యసేవలందిస్తున్న డాక్టర్ సోహిణీ రాఘవ్, సిబ్బంది

రేగిడి: మండలంలోని కె.ఎం.వలస, వండానపేట, గుల్లపాడు గ్రామాల్లో రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి సోహిణీ రాఘవ్ ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. ప్రజలకు వివిధ వైద్య పరీక్షలు చేశారు.జ్వరం, తదితర ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి ఉచితంగా మందులు అందజేశారు. ప్రజలకు ఆరోగ్య జాగ్రత్తలు సూచించారు. వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. నివాస పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడి వేడి ఆహారపదార్థాలను తినాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు జయలక్ష్మి, రత్నాలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.